మైక్రో 'స్టాప్'!

హైరానా సృష్టించిన 'మైక్రోసాఫ్ట్' సాంకేతిక సమస్య

- 'క్రౌడ్‌స్ట్రైక్' అప్‌డేట్ వల్ల ఊహించని ఉపద్రవం
- లక్షలాది కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లలో బ్లూస్క్రీన్ ఎర్రర్
- ప్రపంచవ్యాప్తంగా ఆటోమేటిగ్గా సిస్టమ్‌ల షట్ డౌన్
- ఇంటర్నెట్ వాడే అన్ని రంగాలపైనా తీవ్ర ప్రభావం
- గందరగోళంగా మారిన విమానయాన సేవలు
- స్తంభించిన బ్యాంకింగ్ సేవలు..కుప్పకూలిన మార్కెట్లు
- భారత్‌పైనా ప్రభావం..నివారణ చర్యలు చేపట్టిన కేంద్రం



న్యూఢిల్లీ/హైదరాబాద్, స్పెషల్ టాస్క్ బ్యూరో (నమస్తే తెలంగాణ) జూలై 19: మైక్రోసాఫ్ట్‌లో శుక్రవారం తీవ్ర సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా విండోస్‌తో పని చేసే లక్షలాది కంప్యూటర్లు మొరాయించాయి. వాటికవే షట్‌డౌన్ అయిపోయాయి. మళ్లీ ఆన్‌చేయగానే కంప్యూటర్ల స్క్రీన్‌ల మీద 'బ్లూస్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్' కనిపించింది. 'మీ పీసీలో సమస్య తలెత్తింది. రీస్టార్ట్ చేయండి' అనే సందేశం స్క్రీన్‌పై దర్శనమిచ్చింది. అయితే, ఎన్నిసార్లు రీస్టార్ట్ చేసినా ఇదే సమస్య పునరావృతమైంది. దీంతో అనేక దేశాల్లో ఇంటర్నెట్ ద్వారా పని చేసే వ్యవస్థలన్నీ స్తంభించిపోయాయి. బ్యాంకింగ్, విమానయాన, ఐటీ సేవల్లో తీవ్ర అంతరాయం కలిగింది. కొన్ని విమానాలు రద్దయ్యాయి. ఇంకొన్ని ఆలస్యమయ్యాయి. కొన్ని చోట్ల ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు సైతం నిలిచిపోయాయి. దీంతో అంతటా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విండోస్ 10, 11 ఆపరేటింగ్ సిస్టమ్‌లలో ప్రధానంగా సమస్య తలెత్తింది. విండోస్ 7 ఓఎస్‌తో నడిచే సిస్టమ్‌లు యథావిధిగా పని చేశాయి. మ్యాక్, లైనెక్స్ సిస్టమ్‌లకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. మైక్రోసాఫ్ట్‌పై సైబర్ దాడి జరిగిందనే ప్రచారం జరిగింది. దీంతో వినియోగదారుల్లో ఆందోళన మొదలయ్యింది. అనేక గంటల పాటు శ్రమించిన నిపుణులు చివరకు సమస్యకు పరిష్కారాన్ని కనుగొన్నారు. కంప్యూటర్లు మళ్లీ ఎలా ఆన్ చేయాలో వినియోగదారులకు మైక్రోసాఫ్ట్ సూచనలు చేసింది.

ఎందుకు జరిగింది?

మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులైన విండోస్ 10,11 వెర్షన్‌లలో, క్లౌడ్ సర్వీసులతో నడిచే పీసీలు, ల్యాప్‌టాప్‌లు, మైక్రోసాఫ్ట్ 365 యాప్స్, సర్వీసుల్లోనూ ఇటీవల చేపట్టిన క్రౌడ్‌స్ట్రైక్ సెక్యూరిటీ అప్‌డేట్ కారణంగానే 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ (బీఎస్‌వోడీ)' సమస్య తలెత్తినట్లు మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. 'క్రౌడ్‌స్ట్రైక్' అనేది అమెరికాకు చెందిన ఓ సైబర్ సెక్యూరిటీ సంస్థ.

ఇది 2011లో ఏర్పాటైంది. మైక్రోసాఫ్ట్‌తో పాటు దిగ్గజ సంస్థలకు అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీని అందిస్తుంది. తాజాగా విండోస్ సిస్టమ్స్‌లో నెలకొన్న బ్లూ స్క్రీన్ ఎర్రర్‌కు తామిచ్చిన తాజా సెక్యూరిటీ అప్‌డేట్ 'ఫాల్కన్ సెన్సర్'లో ఓ బగ్ కారణమని క్రౌడ్‌స్ట్రైక్ కూడా అంగీకరించింది.

స్తంభించిన ప్రపంచం!

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా భారత్ మాత్రమే కాదు అమెరికా, ఆస్ట్రేలియా, ఐరోపా దేశాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, శాంతి-భద్రతలు, బ్యాంకింగ్, ఐటీ, రైల్వే, దవాఖాన, మీడియా, పేమెంట్ సర్వీసులు, స్టాక్ మార్కెట్లు, విమానయానం ఇలా దాదాపు అన్ని రంగాలు ప్రభావితమయ్యాయి. విండోస్‌లో సమస్య కారణంగా బ్రిటిష్ న్యూస్ ఛానెల్ స్కైన్యూస్ వార్తలను ఎయిర్ చేయడంలో అవాంతరాలు ఎదుర్కొన్నది. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో సమస్యలు తలెత్తాయి. అక్కడి మెట్రో సర్వీసులు సైతం నిలిచిపోయాయి. జర్మనీ, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ ఇలా ఐరోపాలోని అన్ని దేశాలపై ప్రభావం పడింది. ఆస్ట్రేలియాలోని వూల్‌వర్త్స్ అనే సూపర్ మార్కెట్ సేవల్లోనూ అంతరాయం తలెత్తింది. పాయింట్ ఆఫ్ సేల్స్‌లో కస్టమర్ల బ్యాంకు కార్డులు కూడా పనిచేయడం లేదు. ఏబీసీ న్యూస్ 24 బ్రాడ్‌క్యాస్టింగ్‌లోనూ సమస్యలు ఏర్పడ్డాయి. ఆస్ట్రేలియా వ్యాప్తంగా ఉన్న పోలీసు స్టేషన్లలోని సిస్టమ్‌లు మొరాయించాయి. ప్రపంచవ్యాప్తంగా పలు విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. విమాన సేవలు ఆలస్యం, క్యాన్సిలేషన్లు పెరిగాయి. మెల్‌బోర్న్, వర్జిన్ ఆస్ట్రేలియా, సిడ్నీ ఎయిర్‌పోర్ట్‌లో పలు విమానాలు నిలిచిపోయాయి. అమెరికాలో డెల్టా ఎయిర్‌లైన్స్, యూనైటెడ్ ఎయిర్‌లైన్స్, అమెరికన్ ఎయిర్‌లైన్స్, ఫ్రంటీయర్ ఎయిర్‌లైన్స్ సంస్థలు కొన్ని విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇక ఐటీ, ఐటీఈఎస్, ప్రైవేటు కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. బ్యాంకులు, దవాఖాన, మీడియాపైనా ప్రభావం పడింది. కొన్ని దేశాల్లో ఆన్‌లైన్‌తో అనుసంధానమై ఉన్న పోలీసుల వ్యవస్థలు క్రాష్ అయ్యాయి.

క్రౌడ్‌స్ట్రైక్ అప్‌డేట్ వల్లే: సత్య నాదెళ్ల

మైక్రోసాఫ్ట్‌లో అంతరాయంపై ఈ సంస్థ సీఈవో సత్య నాదెళ్ల స్పందించారు. 'క్రౌడ్‌స్ట్రైక్ విడుదల చేసిన ఒక అప్‌డేట్ ప్రపంచవ్యాప్తంగా ఐటీ వ్యవస్థలను ప్రభావితం చేయడం ప్రారంభించింది. ఈ సమస్య గురించి మాకు అవగాహన ఉంది. మళ్లీ సిస్టమ్‌లను సురక్షితంగా ఆన్‌లైన్‌లోకి తీసుకురావడం కోసం వినియోగదారులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు అందించేందుకు క్రౌడ్‌స్ట్రైక్‌తో కలిసి పని చేస్తున్నాం' అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సాంకేతిక సమస్య కారణంగా నిలిచిపోయిన మైక్రోసాఫ్ట్ 365 యాప్‌లు, సర్వీసుల్లో సమస్యను పరిష్కరించామని ఈ సంస్థ ప్రకటించింది.

ఏమిటీ 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్'?



కంప్యూటర్, లేదా ల్యాప్‌టాప్ స్క్రీన్ మీద హఠాత్తుగా ఓ బ్లూ స్క్రీన్ కనిపిస్తుంది. అందులో ఎర్రర్ మెసేజీ ఉంటుంది. ఆ తర్వాత కంప్యూటర్ ఒక్కసారిగా షట్ డౌన్ లేదా రీస్టార్ట్ అవుతుంది. ఈ సమస్యను 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్' లేదా 'బ్లాక్ స్క్రీన్ ఎర్రర్స్' లేదా 'స్టాప్ కోడ్ ఎర్రర్స్'గా పిలుస్తారు. సాధారణంగా హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సమస్యల వల్ల ఈ ఎర్రర్స్ తలెత్తుతుంటాయి. ఏదైనా హార్డ్‌వేర్‌ను కొత్తగా ఇన్‌స్టాల్ చేయడం వల్ల బ్లూ స్క్రీన్ ఎర్రర్ తలెత్తి ఉంటే.. సిస్టమ్‌ను షట్‌డౌన్ చేసి, హార్డ్‌వేర్‌ను తొలగించి రీస్టార్ట్ చేయాల్సి ఉంటుంది. తాజాగా విండోస్‌లో తలెత్తిన ఎర్రర్ సాఫ్ట్‌వేర్ సమస్య కిందకు వస్తుంది.

భారత్‌లో ఏం జరిగింది?

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా దేశంలోని ప్రధాన రంగాలన్నీ ప్రభావితమయ్యాయి. విమాన సర్వీసుల దగ్గరి నుంచి దవాఖాన, బ్యాంకింగ్ వరకు ఇలా అన్ని సర్వీసుల్లోనూ సమస్యలు తలెత్తాయి. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఆకాశ, స్పైస్‌జెట్, విస్తారా తదితర ప్రముఖ విమానయాన సంస్థల సేవలపై దీని ప్రభావం పడింది. సాంకేతిక కారణాల వల్ల బుకింగ్, చెక్-ఇన్, బోర్డింగ్ పాస్ ఇష్యూయింగ్, ఫ్లైట్ స్టేటస్ చెకింగ్ తదితర సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఒక్క ఇండిగో విమానయాన సంస్థే 200కు పైగా విమాన సేవలను నిలిపేసింది. ఇక, బెంగళూరు ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 1 గుండా ప్రయాణాలు సాగిస్తున్న 90 శాతం విమానాలు నిలిచిపోయాయి. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్ విమానాశ్రయాల్లోని ఫ్లైట్ ఆపరేషన్లలో అంతరాయాలు కలిగాయి. కొన్ని ప్రైవేటు బ్యాంకులు, దవాఖానల్లోనూ సేవల్లో అంతరాయం ఏర్పడినట్టు నెటిజన్లు వెల్లడించారు. మైక్రోసాఫ్ట్‌కు చెందిన మైక్రోసాఫ్ట్ 365, మైక్రోసాఫ్ట్ టీమ్, మైక్రోసాఫ్ట్ అజుర్ సర్వీసులతో పాటు ఇన్‌స్టాగ్రామ్, అమెజాన్, జీమెయిల్ సేవల్లోనూ సమస్యలు ఎదుర్కొన్నట్టు పేర్కొన్నారు.

సైబర్ దాడి కాదు!

తామిచ్చిన తాజా సెక్యూరిటీ అప్‌డేట్‌లో ఓ బగ్ కారణంగానే ఈ సమస్య తలెత్తింది. అయితే, ఇది భద్రతాపరమైన వైఫల్యమో, సైబర్ దాడో కాదు. ఇప్పటికే సమస్యను గుర్తించి డీబగ్‌ను ఫిక్స్ చేశాం.

-క్రౌడ్ స్ట్రైక్ సీఈవో జార్జ్ కుర్జ్

బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయంలో భారీ సంఖ్యలో వేచిచూస్తున్న ప్రయాణికులు

సాయంత్రం మొదలై...

మైక్రోసాఫ్ట్ విండోస్ 10,11 వెర్షన్‌లలో సాంకేతిక సమస్య అమెరికా కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 6-7 గంటల మధ్య మొదలైంది. అంటే భారత్‌లో శుక్రవారం ఉదయం మొదలైనట్టు. ఆ సమయంలో అగ్రరాజ్యంలో వ్యాపార కార్యకలాపాలు ముగిసిపోవడం, భారత్ వంటి పశ్చిమాసియా దేశాల్లో మొదలు కాకపోవడంతో ఆర్థికంగా కొంతమేర నష్టం తగ్గినట్టు నిపుణులు చెప్తున్నారు.

భారత్‌లో ప్రభావం స్వల్పం : ఆర్బీఐ

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం ప్రభావం మన దేశంలో స్వల్పంగా ఉందని భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) శుక్రవారం తెలిపింది. 10 బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల కార్యకలాపాలకు కాసేపు అంతరాయం కలిగిందని చెప్పింది. చాలా బ్యాంకుల కీలక వ్యవస్థలు క్లౌడ్‌లో లేవని, కొన్ని బ్యాంకులు మాత్రమే క్రౌడ్ స్ట్రైక్‌ను వాడుతున్నాయంది.

కాపాడిన విండోస్ 7

మైక్రోసాఫ్ట్ మార్కెట్లోకి విండోస్ 11, 10 వెర్షన్లను కొత్త ఫీచర్లతో తీసుకొచ్చినప్పటికీ, భారత్‌లో చాలామంది విండోస్ 7, విండోస్ 8, 8.1 వెర్షన్లనే ఎక్కువగా వాడుతున్నారు. మైక్రోసాఫ్ట్ గణాంకాల ప్రకారం విండోస్ 11, 10 వెర్షన్లను వాడే వినియోగదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తున్నప్పటికీ అవన్నీ లైసెన్స్‌డ్ వెర్షన్లుగా గమనించాల్సి ఉంటుంది. నిజానికి ప్రతి పదిమంది యూజర్లలో ఒకరు లైసెన్స్‌డ్ వెర్షన్‌ను వాడుతుంటే, మిగతావారు అన్‌లైసెన్స్‌డ్ వెర్షన్‌నే వాడుతున్నారు. అందులోనూ అత్యధికులు విండోస్ 7, 8, 8.1 అన్‌లైసెన్స్‌డ్ వెర్షన్లనే వినియోగిస్తున్నారు. ఈ వెర్షన్లలో 'క్రౌడ్‌స్ట్రైక్' తాజా సెక్యూరిటీ అప్‌డేట్ సపోర్ట్ చేయదు. అదే ఇప్పుడు మంచిదైంది.



కోల్‌కతా ఎయిర్‌పోర్టులో మాన్యువల్‌గా ఇచ్చిన బోర్డింగ్ పాస్

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 36 విమాన సర్వీసులు రద్దు

మాన్యువల్‌గా రాసి బోర్డింగ్ పాసులు జారీ

హైదరాబాద్ సిటీబ్యూరో/శంషాబాద్ రూరల్, జూలై 19 (నమస్తే తెలంగాణ): కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టం మైక్రోసాఫ్ట్ విండోస్ పనిచేయకపోవడంతో విమాన సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే పలు విమానాలు రద్దయ్యాయి. మరికొన్ని విమానాల రాకపోకల్లో తీవ్ర జాప్యం తలెత్తింది. దేశ విదేశాలకు వెళ్లాల్సిన 36 విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఎయిర్‌పోర్టు ప్రతినిధులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. విమానాల రాకపోకలకు సంబంధించిన కార్యకలాపాలన్నీ కంప్యూటర్ల మీదే జరుగుతాయి. మైక్రోసాఫ్ట్ విండోస్ సాంకేతిక సమస్య కారణంగా విమాన ప్రయాణికుల వివరాలను తనిఖీ, బోర్డింగ్ పాస్‌ల జారీని ఇవ్వలేకపోయారు. కొన్ని విమానాల రాకపోకలను కొనసాగించేందుకు బోర్డింగ్ పాస్‌లను మాన్యువల్‌గా రాసి ఇచ్చి విమానాల ప్రయాణాలు సాగేలా చర్యలు చేపట్టారు. సాంకేతిక సమస్య వల్ల విమాన సర్వీస్ సిగ్నళ్లకూ అంతరాయం ఏర్పడింది. అయితే విమాన సర్వీసుల రద్దు వల్ల కొందరు ప్రయాణికులు 7-8 గంటలపాటు ఎయిర్‌పోర్టులోనే పడిగాపులు కాశారు.

మైక్రోసాఫ్ట్‌తో సమన్వయం.. ఇబ్బందులు రానివ్వం

ఎన్ఐసీ ప్రభావితం కాలేదు.. - కేంద్ర ఐటీ మంత్రి వైష్ణవ్

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక లోపంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. సమస్య ఉత్పన్నం కాగానే ప్రభుత్వం మైక్రోసాఫ్ట్ కంపెనీతో టచ్‌లోకి వెళ్లిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ ఎర్రర్ కారణంగా నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్(ఎన్ ఐసీ) నెట్‌వర్క్ ప్రభావితం కాలేదని పేర్కొన్నారు. ఎన్ఐసీకి చెందిన ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కమ్యూనికేషన్ సేవలు అందిస్తుంది. మైక్రోసాఫ్ట్‌లో సాంకేతిక సమస్య నేపథ్యంలో ఇండియన్ కంప్యూటర్ రెస్పాన్స్ టీమ్(సీఈఆర్టీ) ఒక అడ్వైజరీ జారీ చేసిందని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

ప్రయాణికులకు ఇబ్బంది రానివ్వొద్దని ఆదేశించాం

మైక్రోసాఫ్ట్ సాంకేతిక లోపం నేపథ్యంలో విమాన ప్రయాణికుల కోసం కేంద్ర పౌర విమానయాన శాఖ గైడ్ లైన్స్ జారీ చేసింది. ఎయిర్‌పోర్టుల్లో వేచి చూస్తున్న వాళ్లకు ఆహారం, మంచినీళ్లు, ఇతర సదుపాయాలు అందించాలని, విమాన సర్వీసుల సమాచారం అందజేయాలని ఆదేశించినట్టు విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. పరిస్థితిని మంత్రిత్వ శాఖ, ఏఏఐ నిశితంగా పరిశీలిస్తున్నదని, త్వరిత పరిష్కారం కోసం మైక్రోసాఫ్ట్‌తో సమన్వయం చేసుకొంటున్నట్టు చెప్పారు.

చరిత్రలోనే అతిపెద్ద ఐటీ అంతరాయం

నిపుణుల అభిప్రాయం

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ విండోస్ సేవలకు ఆటంకం కలగడం ఐటీ చరిత్రలోనే అతిపెద్ద అంతరాయంగా ఐటీ నిపుణులు అభివర్ణిస్తున్నారు. సైబర్ దాడి వల్ల ఇలా జరిగి ఉండొచ్చని సైబర్ నిపుణుడు అనూజ్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద సంస్థలు అప్‌డేట్లు చేసినప్పుడు పూర్తిస్థాయిలో టెస్టింగ్ చేస్తారని, అయినా ఇది జరిగిందంటే సైబర్ దాడి కావొచ్చని పేర్కొన్నారు. ఈ సమస్య వ్యాపారాలపై తక్షణ ప్రభావం చూపించడంతో పాటు చాలా నెలల పాటు సైబర్ సెక్యూరిటీ ముప్పుకు కారణం కావొచ్చని గ్రేహౌండ్ రీసెర్చ్ వ్యవస్థాపకుడు సంచిత్‌వర్ గోగియా హెచ్చరించారు. చరిత్రలో ఇది అతిపెద్ద ఐటీ అంతరాయంగా సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు ట్రోయ్ హంట్ పేర్కొన్నారు.

పెంటాగాన్‌కూ తంటా

మైక్రోసాఫ్ట్ విండోస్ లేటెస్ట్ వెర్షన్‌ను అమెరికాలోని ప్రభుత్వ, పోలీసు, రక్షణ విభాగాలు కూడా వినియోగిస్తున్నాయి. తాజాగా సమస్య ఎదురవ్వడంతో ఆ విభాగాలతో పాటు అగ్రరాజ్య భద్రతా కార్యాలయం పెంటాగాన్‌లోనూ పలు కంప్యూటర్లు మొరాయించాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

పారిస్ ఒలింపిక్స్‌పైనా ప్రభావం

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సమస్య ప్రభావం.. మరో వారంలో ప్రారంభం కానున్న పారిస్ ఒలింపిక్స్ 2024పైనా పడింది. కంప్యూటర్లు షట్‌డౌన్ కావడంతో నిర్వహణకు సంబంధించిన ఐటీ కార్యకలాపాల్లో అంతరాయం ఏర్పడినట్టు ఆర్గనైజర్లు పేర్కొన్నారు. అయితే, సమస్యను పరిష్కరించినట్టు వెల్లడించారు.

ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌లో అంతరాయం

ఏం జరిగింది?
విండోస్‌పై నడిచే చాలా కంప్యూటర్లలో 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్' సందేశాలు వచ్చి నిలిచిపోయాయి.

ఎప్పుడు?
శుక్రవారం తెల్లవారుజాము నుంచి...

:(BSOD

ప్రభావమేంటి?
మైక్రోసాఫ్ట్ వినియోగించే పలు కంప్యూటర్లు పనిచేయలేదు

అప్‌డేట్ ఏంటి?
ఫాల్కాన్ సెన్సార్ అనేది ఎప్పటికప్పుడు సైబర్ దాడుల నుంచి రక్షణ కల్పిస్తుంది.

సమస్య ఎక్కడ?
క్రౌడ్‌స్ట్రైక్‌కు చెందిన ఫాల్కాన్ సెన్సార్ అప్‌డేట్‌లో లోపం తలెత్తింది. ఇది విండోస్ వ్యవస్థను విఫలం చేసింది.

ఏయే రంగాలపై ప్రభావం.. ఆర్థిక నష్టమెంత?

ప్రభుత్వ, ప్రైవేటు, శాంతిభద్రతలు, బ్యాంకింగ్, ఐటీ, ఐటీఈఎస్, రైల్వే, వైద్య, మీడియా, పేమెంట్ సర్వీసులు, స్టాక్ మార్కెట్లు, విమానయానం తదితర రంగాలపై విండోస్ ఎర్రర్ ప్రభావం చూపించింది. సేవల్లో అంతరాయంతో ఇప్పటికిప్పుడు ఎంత ఆర్థిక నష్టమన్న విషయాన్ని నిపుణులు అంచనా వేయనప్పటికీ, నష్టం విలువ ట్రిలియన్ డాలర్లలోనే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రభావితమైన దేశీయ విమానయాన సంస్థలు

- ఎయిరిండియా
- ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్
- ఇండిగో
- ఆకాశ
- స్పైస్‌జెట్
- విస్తారా

వీకెండ్ శుక్రవారమే మొదలైంది!

మైక్రోసాఫ్ట్ సాంకేతిక సమస్యపై నెటిజన్ల సెటైర్లు

న్యూయార్క్, జూలై 19: మైక్రోసాఫ్ట్ విండోస్‌లో శుక్రవారం సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పలు రంగాల్లో ఏర్పడిన అంతరాయంపై నెటిజన్లు కొందరు సరదాగా స్పందించి జోక్‌లు, మీమ్‌లు, ఎమోజీలతో కామెంట్లు చేశారు. 'కొంతమందికి శుక్రవారమే వారాంతం ప్రారంభమైంది. హ్యాపీ వీకెండ్, థాంక్యూ మైక్రోసాఫ్ట్, థాంక్యూ బ్లూ స్క్రీన్' అని ఒకరు కామెంట్ చేశారు. 'మైక్రోసాఫ్ట్ డౌన్‌కు కారకుడైన ఆ వ్యక్తికి కార్పొరేట్ ఉద్యోగులంతా కృతజ్ఞతలు చెబుతున్నారు' అని మరొకరు పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్‌లో అప్రాధాన్యమున్న బ్లూ స్క్రీన్‌ను హైలెట్ చేస్తూ మరికొందరు మీమ్స్ ఉంచారు. ఒంటి నిండా నీలం రంగు పూసుకుని ఉన్న ఒక వ్యక్తి మీమ్‌ను ఎక్స్‌లో ఒక యూజర్ ఉంచి 'ప్రస్తుతం ప్రతి కంపెనీలో ఐటీ విభాగాలు' అంటూ క్యాప్షన్ పెట్టాడు. సిస్టమ్‌పై బ్లూ స్క్రీన్ చూసి కార్పొరేట్ ఉద్యోగులు బాధ నటిస్తూ లోపల ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్న భావనతో ఉండే మీమ్‌లను కొందరు షేర్ చేశారు.

మైక్రోసాఫ్ట్‌లో సాంకేతిక లోపంతో పలు రంగాల్లో వర్క్ నిలిచిపోవడంతో సోషల్ మీడియాలో పెద్దయెత్తున షేర్ అయిన పలు రకాల మీమ్స్

మైక్రోసాఫ్ట్ కాదు.. మేక్రోహార్డ్: మస్క్

మైక్రోసాఫ్ట్‌పై టెస్లా వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ కూడా వ్యంగ్యంగా స్పందించారు. మైక్రోసాఫ్ట్... మేక్రోహార్డ్‌గా మారిందంటూ 2021లో తాను చేసిన పోస్టును ఆయన రీపోస్ట్ చేస్తూ 'టీమ్‌లు చాలా బాగున్నప్పటికీ' అంటూ వ్యాఖ్యానించారు. రెండు నవ్వుతున్న ఎమోజీలతో డాగ్ డిజైనర్ షేర్ చేసిన మీమ్‌పై కూడా మస్క్ తన ఎక్స్‌లో స్పందించారు. 'తక్కినవన్నీ మూతపడినా ఈ యాప్ మాత్రం ఇప్పటికీ పని చేస్తున్నది' అంటూ క్యాప్షన్ ఉంచారు. ప్లే గ్రౌండ్‌లో కొందరు క్రికెట్ ఆడుతుండగా, ఒక వ్యక్తి పడుకుని తాపీగా వారిని చూస్తున్న దృశ్యం మస్క్ షేర్ చేసిన మీమ్‌లో ఉంది.

'గాలి'లో బతుకులు..!

మైక్రోసాఫ్ట్‌లో సాంకేతిక కారణాల వల్ల ఫ్లైట్ బుకింగ్, చెక్-ఇన్, బోర్డింగ్ పాస్ ఇష్యూయింగ్‌లో మాత్రమే కాకుండా ఫ్లైట్ ట్రాకింగ్, ఫ్లైట్ స్టేటస్ చెకింగ్‌లోనూ సమస్యలు తలెత్తినట్టు అమెరికన్ విమానయాన సంస్థ ఫ్రంటీయర్ ఎయిర్‌లైన్స్ పేర్కొంది. విండోస్ ఓఎస్‌లో తలెత్తిన సమస్యతో తమ విమానాలు గాల్లో ఎక్కడ ఉన్నాయన్న సమాచారమూ తమకు తెలియలేదని అధికారి ఒకరు వాపోయారు.

మైక్రోసాఫ్ట్ విండోస్ చరిత్ర

డెవలపర్ – మైక్రోసాఫ్ట్
తొలి వెర్షన్ – విండోస్ 1, 1985
తాజా విడుదల 23హెచ్2, 2024
అందుబాటులోని భాషలు – 110
లైసెన్స్‌డ్ యూజర్లు –110 కోట్లు
అన్‌లైసెన్స్‌డ్ యూజర్లు–540 కోట్లు
మొత్తం యూజర్లు
650 కోట్ల మంది
ప్రపంచవ్యాప్తంగా వాడే కంపెనీలు – 90 శాతం
విండోస్ వాడే దేశాలు – 190